# ప్రేమికుల చిఠాలోని ఆఖరు పేజీ

క్రేబేజీ అంటే ఏమిటో తెలియని వాళ్లు ఈ 'గ్రో మోర్ ఫుడ్' రోజుల్లో ఉండరనుకుంటాను. తెలియని పల్లెటూరి వారెక్కడేనా వుంటే వెంటనే మీ సామీప్యపట్నానికి వెళ్ళి కూరల మార్కెట్టులో దాని దర్శనం చేసుకోండి. లేకపోతే మీ డివిజనుకు చెందిన నేషనల్ వార్ ఫ్రంటు ఆర్గనైజరుకు వ్రాయండి. దానికి సంబంధించిన వాఙ్మయం, ఫోటోలతో సహా పంపిస్తాడు.

ఈ చిన్న ఉపోద్ఘాతంతో కేబేజీ తత్వాన్ని బోధించే ఒక చిన్న ఇతిహాసాన్ని ఇక్కడ వివరిస్తాను.

ఇది పాతిక ముప్ఫయి సంవత్సరాలనాటి మాట. ఇండియాకువచ్చి కలక్టరు ఉద్యోగం స్వీకరించిన ఒక పాశ్చాత్యుడు ఒక రోజున ముచ్చటపడి తన వంటవాడ్ని పిలిచి తన కావేళ కేబేజీ కూరచేసి పెట్టమన్నాడు. ఆ వంటవాడికి కేబేజీ అంటే ఏమిటో అంతవరకూ అనుభవం లేదు. అది ఫలానా మార్కెట్టులో ఫలానా అంగడి వాడివద్ద వుంటుంది, కొనిపట్రా అని సలహా యిచ్చాడు వాడికి, దొరగారు—

కొంతసేపటికి కేబేజీ యథావిధిగా వంటిల్లు జేరుకుంది. వంటవాడు దానిపైన వుండే చీరలన్నీ ఒలవడం ప్రారంభించాడు. ఒక్కొక్క ఆకు చొ॥న సమూలంగా దాన్ని అక్కడ ఒలిచిపెట్టి, ఏమీ కనపడక పోగా విభ్రాంతుడై దొరగార్ని సమీపించి 'స్వామీ! దుకాణదారుడు మనల్ని మోసగించాడు-మీకీవేళ కేబేజీ కూరతినే అదృష్టం పట్టలేదు-' అన్నాడు.

దొరగారు ఆశ్చర్యపోతూ 'ఏం జరిగిందేమిటి చెప్పు-కేబేజీ కుళ్లిందా?' అన్నాడు.

అప్పుడు వంటవాడు 'కుళ్ళలేదండి-కాని, దాన్ని ఎంత ఒలిచి చూచినా ఆకులే వస్తున్నాయి గాని కూర వండడానికి తగిన సంభార మేమీ అందులో లేదు-ఆ ఆకులన్నీ తీసికెళ్ళి మీ గుర్రం నోటి కందించాను-' అన్నాడు.

ఈ సంజాయిషీతో దొరగారి శ్వాస నిలిచిపోయి, ఉక్కిరిబిక్కిరయ్యాడు. కొంతసేపటికి తేరుకుని కేబేజీ తత్వమంతా వంటవాడికి

బోధించి అతనిచేత యెన్నో కేబేజీలను ఒలిపించుకుని, వండించుకుని తిన్నాడు.

కాని, వంటవాడికి మాత్రం ఆ కేబేజీ ఎప్పటికీ అర్థంకాక అతని దృష్టిపథంలో అదొక మాయాబజారులోని 'ఎక్జిబిట్' గానే వుండిపోయింది. అంతా శ్రమపడి తెచ్చి, తుదంటా ఒలిచిచూస్తే ఆకులు తప్ప మరేమీ మిగలకపోవడం అనే విషయంలో అతడు రాజీపడలేకపోయాడు!

ఎందుచేతనో గాని ప్రేమించి పెళ్ళాడటమంటే పైన వివరించిన కేబేజీ గాథ జ్ఞప్తికి వస్తుంది మనకు. ఇందులో మనం గమనించాల్సినవి మూడు ప్రధానాంశాలు-ఒకటి! కేబేజీ-ఇది స్త్రీ; రెండు: దీన్ని పచనంచేసి అరగించేవాడు-పురుషుడు; మూడు: దీన్ని ఒలిచి కూరగా వండడం అనే క్రియ ఇదే ప్రేమించి, పెళ్ళి చేసుకోవడమంటే! ఈ విషయం తరిచి చూసినకొద్దీ పైకథలోని వంటవాడితో మనం ఏకీభవించాల్సిన కారణాలు అనేకం మనకి కనబడుతూంటాయి.

కేబేజీ తత్వంగల స్త్రీని ప్రేమించడం, ప్రేమించాననుకోవడం మొగవాడు పడే భ్రాంతులలో ఒకటి. ఒలవగా ఒలవగా ఆకులే తప్ప హృదయం కనబడదు, ఈ ప్రేమ సంఘటనలో.

'స్త్రీ అనేది ఒక కేబేజీ, మొగవాడనే చీడపురుగు దాన్ని ఆశ్రయించుకుని, దానిమీద ప్రాకుతూ, ఒక్కొక్క ఆకు నేతని, జీర్ణించుకుంటూ, చివరకు మిగిలేది ఏమీ లేదని తెలుసుకుంటాడు' అన్నాడు ఒక విజ్ఞానవేత్త.

ప్రేమికుల చిఠాలో చివర పేజీన ఎర్రటి అక్షరాలతో లిఖింపబడి వుండే శాశ్వతమైన నిజం-చిఠానిల్వ-ఈ పిప్పే!

స్త్రీ పురుషులు తమ శారీరక లక్షణాలచేత ఆకర్షింపబడి ఒకరికొకరు దగ్గిరవుతారు. హృదయాల రాపిడికి అగ్ని ప్రజ్వరిల్లుతుంది. ఆ హోమ గుండంలో ఇద్దరూ ఆహుతి అవుతారు. దీన్ని స్నేహం అనండి, వాంఛ అనండి, అవసరం అనండి, నరాలయుద్ధం అనండి, ఏమనండి, ప్రేమ అని మాత్రం అనకండి.